చిన్న కథ

# అదిగో అదిగో చూడండి!

యస్. కాశీ విశ్వనాథం

అదిగో అదిగో చూడండి.

అక్కడ. ఆ రోజు

ఎండ చండ ప్రచండంగా వుంది.

ఆ సమయంలో ఎయిర్ కండిషన్డ్ రూములున్నవారు అమ్మయ్య-అనుకోగలుగుతున్నా, తతిమ్మా వారుమాత్రం 'అమ్మయ్యో' అనే అనుకుంటున్నారు. ఎర్రటి ఎండకి కరిగిన నల్లటి తారు మెరుస్తూ అందంగా కనబడుతోందే గాని జోడులేకుండా నడిస్తే మాత్రం భయంకరంగా ఉంటుంది.

ఫెళ్ళుమంటున్న ఎండలో పెళ్ళికూతుర్లా ముస్తాబైన 'అలంకార్' థియేటరు ముందు గజిబిజిగా వంకరు తిరిగిన 'క్యూ'లో చెమట కక్కుతున్న జనం నిలబడివున్నారు. నెత్తికి రాసుకొన్న నూనె ఎండకి కరిగి, చెమటతో చేరి జోరికలుగా ముఖంమీదకి జారుతుంటే వొంటిమీద మూడు చినుగుల్తో వున్న చొక్కాతో ముఖం తుడుచుకుంటున్న నాగరాజు ఆ 'క్యూ'లో నిలబడి వున్నాడు. 'క్యూ'లో వున్న వారి ముఖాలు జిడ్డుతోను, బట్టలు చెమటతోను వుండటం వలన సర్దాకోసం సిన్మాకెళుతున్న మనుషుల ముఖాల్లాకాక, భయంతో పది మైళ్ళు సముద్రం ఈదుకొచ్చిన ఆర్తుల ముఖాల్లా అలసిపోయి వున్నాయి.

ఆ రోజు అలంకార్లో కొత్త చిత్రం విడుదలయింది. అది పంచ రంగుల చిత్రమే గాక పద్మశ్రీ గారు నటించిన చిత్రం కాబట్టి, రెండు వందరోజులు రోజుకి మూడాటలు చొప్పున ఆడటం ఖాయమని ప్రతి ప్రేక్షకుడూ అనుకొంటున్న కారణం చేత, వూళ్ళోని సగం జనాభా అక్కడే వున్నారనిపించేటంత రద్దీగా వుంది. అక్కడ ఆ ఎండలో, ఆ చెమటలో, ఆ కంపులో కాళ్ళకు రక్తాలు దిగుతున్నా, చెప్పులకు నోచుకోని కాళ్ళు సల సల కాగుతున్నా, ఆ తోపులాటలో తూలి పోయి, ఒక వేళ 'క్యూ' నించి బయటికి జారిపోతే అక్కడున్న పోలీసులు రెక్క పట్టుకుని వెనక్కి లాగేస్తారన్న భయంతో వూపిరి బిగబట్టి, గుప్పిట్లో వుంచిన రూపాయినోటుని ఎంతోగట్టిగా ఇంకెంతో భద్రంగా పట్టుకుని యిటునించి రాటుకి అటునుంచి పోటుకి తట్టుకుంటూ, నలభై

పైసల టిక్కెట్ల 'క్యూ'లో నిల్చున్న నాగరాజు వయసు-పన్నెండు!

ఇంకా స్పేపట్లో 'బుకింగ్ తలుపులు తెరవకపోతే యీ తోపులాటలో మంచి నీళ్ళయినా అడగకుండా చచ్చిపోవడం ఖాయమని పావుగంట క్రితమే నిర్ణయించుకున్న నాగరాజు కడుపులోకి రెండు వొంగడాలు, ఒక జంతిక వెళ్ళి మూడు గంటలయింది. ఆరోజు అక్కడికి వచ్చేటప్పటికి ఉదయం పది గంటలయింది. కానీ, అప్పటికే ముప్పైనలభై మంది 'క్యూలో నిలబడివున్నారు. అయినా పర్వాలేదని నిలుచున్నాడు. చేతిలో పట్టుకున్న రూపాయినోటు తడిసి ముద్దయిపోతున్నా, కడుపులో ఆకలి కదంతొక్కుతున్నా, వొంట్లో నీరసం ప్రతిక్షణం పెరుగుతున్నా నాగరాజు లక్ష్యం చెయ్యక సిన్మా టిక్కట్లు తీస్తున్నాడంటే ఏదో కారణం వుండాలి.

ఏఁవిటది?

పంచరంగుల బొమ్మను చూసి పరవశించి పోదామనా? లేక మొదటి రోజు మేట్నీ చూసేసి 'మేట్నీ చూసిన మొనగాణ్ణి' అనిపించుకుందామనా ?

ఈ రెండింటిలోనూ ఏదీకాదు. బ్లాక్ మార్కెట్టులో టిక్కెట్లమ్ముదామని :

అమ్మితే?

లాభం వస్తుంది.

వస్తే?

బియ్యం కొనుక్కోవచ్చు.

కొంటే?

అమ్మకి ఆకలి తీరుతుంది. చెల్లికి ప్రాణం నిలుస్తుంది.

ఇంట్లో బియ్యం లేవు. రెండేళ్ళు నిండని చెల్లికి రెండు చుక్కల పాలు లేవు. తన తండ్రి రమణమూర్తిగారు బస్సుల్లో పనిచేసేవాడు. ఓ రోజు రాత్రి బస్సును షెడ్‌లో పెట్టేసి యింటికొచ్చి స్నానంచేసి బైటికెళ్ళిసారాతాగొచ్చి పక్కమీదపడిన వ్యక్తి తెల్లారి లేవలేదు. నిద్ర్లోనే ప్రాణాలు పోయాయి. "అంతకుముందే పచ్చకామెర్లతో నెలరోజులు మంచమెక్కిన మనిషి, జబ్బునుంచి పూర్తిగా కోలుకోకముందే మళ్లీ తాగుడు మొదలెడితే చవ్వకేం జేస్తాడు"అన్నారు చుట్టూ ప్రోగయిన యిరుగుపొరుగు.

'బతికినంత కాలఁవూ ఆడు. ఆడి సారా సంగతే జూసుకున్నాడుగాని, కడుపుతోటున్న పెల్లాన్నిగాని, కడుపుకి తిండిలేక తిరుగుతున్న కొడుకునిగాని చూదేలేదు. ఆడి మట్టుకాడు సల్లగా కాలం జేయిస్సినాడు – కానిప్పుడీ దిక్కులేని పచ్చుల సంగతేటి' ? అంటూ వాపోయింది, ఆ యింటితో పిసరంత సంబంధమున్న ఓ ముసల్ది. అంతేకాదు ఓ నాలుగు రోజులపాటు ఆ కుటుంబాన్ని ఆదుకొంది. కాని, అదేం ఖర్మమోగాని, కాలం మళ్ళిన ఆ ముసల్దానికి వారం తిరక్కుండానే కాలం చెల్లిపోవడం చేత నాగరాజు కుటుంబం మరింత దుర్భర

పరిస్థితుల్లో పడిపోయింది.

"ఇన్నాళ్లూ బస్సుల్లో వస్తే సాదు గదా - ఇలా బిల్డింగ్ సచ్చిపోతే ఈ కుటుంబానికి కాం డబ్బు యివ్వరేటా పొప్రయిటర్లు?" అన్నారు ఆ కుటుంబం పట్ల సానుభూతి వున్నవారు. తర్వాత ప్రొప్రయిటర్ని అడిగారు కానీ;అతను ముఖాన్ని మాడ్చుకొని "డూటీ చేసే టప్పుడు చస్తే కొంతివ్వొచ్చు - కానీ, తప్పతాగి యింటిదగ్గర సచ్చినోడి కిమ్మని రూలు లేదు. ఇలాగ చచ్చినోళ్లందరికీ చందాలిస్తే మేం చస్తాం. అప్పుడు మా కెవడూ యివ్వడు" అన్నాడు.ఏమయినా, చాలామంది దగ్గర్నుంచి దోసిళ్ళకొద్ది సానుభూతి వచ్చింది తప్ప పిడికెడు చిల్లర రాలేదు. అదిగో, ఆ రోజునించి నాగరాజు కుటుంబం రెక్కలు తెగిన పక్షిలా అసహాయంగా అల్లాడిపోవడమే కాక, నెరువెండిపోయిన చేపలాగ గిల గిలలాడిపోయింది.

పిల్లల్ని పోషించుకోవడానికి, తన కడుపు నింపుకోవడానికి నాగరాజు తల్లి సత్తియ్యమ్మకు ఏ దారీ కనిపించ లేదు.చివరికోముహూర్తంలోసిగ్గులజ్జలు, మంచి చెడ్డలు, మానాభిమానాలంటూ నలుగురూ చెప్పే జంటపదాల్ని కట్టకట్టి నిలువెత్తు గోతిలోపాతిపెట్టి,కాలుతున్న కడుపును చేతబట్టి కాసులమ్మ కంపె నీలో కాలుపెట్టింది. అయితే అందు వల్ల కూడా ఆమె ధ్యేయం నెరవేరలేదు. ఒంటిగీత బొమ్మలా సన్నగా, బట్టల తాను మధ్యలో పెట్టే అట్టలా సాపుగా వుండే సత్తియ్యమ్మ ఏ మగాడికీ అక్కర్లేక పోవడంతో ఆమె నిస్సహాయురా లయింది. గుంటలు పడిపోయి లోతుకు పోయిన చప్పిడి బుగ్గలమీద చవకరకం పౌడరు పులిమినా, ఎన్నో చిరుగులు లేని చీరల్ని ఎంత జాగ్రత్తగా ఇస్త్రీ చేయించి కట్టినా, తెల్లగా పాలిపోయిన కళ్ళకు ఎంతటి నల్లకాటుకపెట్టినా తను ఎవరికీ అక్కర్లేదని తెల్సు వడానికి ఎన్నాళ్ళో పట్టలేదు. చివరికి కేరేజీలు మోసేపనికి కుదిరింది.

గత మూడురోజులుగా పొయ్యిలో మంట రాజలేదు. కడుపులోని మంటలు చల్లారలేదు ఈ బాధ పరిష్కారం లేని సమస్యయిందినాగరాజుకి.సత్తియ్యమ్మ నీరసంతో మంచ మెక్కింది. డబ్బులు చేతికొస్తే ఆకలి తీరుతుంది. కానీ డబ్బు లెలా వస్తాయి? ఎలా?? ఎలా??

ఆ రోజు వుదయం నాగరాజు బుర్రలో ఓ ఆలోచన మెరుపులా మెరిసింది. ఊళ్ళో ఆ రోజు కొత్త సినిమా విడుదలవుతోంది. ఆ సినిమాకు టిక్కెట్లు తీసి బ్లాకులో అమ్మితే లాభం వస్తుంది. ఇలా సంపాదించిన డబ్బు తోటే వెర్రిబాబుగాడు. తవుడుగాడు, వెంకట్రావుగాడు పేకాటాడుతారు.కానీ, తను మాత్రం పేకాటాడకూడదు. బియ్యం కొనాలి. ఆలోచన బాగానే

వుంది కానీ, పెట్టుబడో? కనీసం ఓ రూపాయయినా కావాలి. ఇల్లంతా వెది కాడు. విరిగిపోయి, ఒరిగిపోయిన నులక మంచం, కంపు కొట్టే దుప్పట్లు యివే వున్నాయి. ఇవి కాక ఒక ఇత్తడి చెంబుంది. అంతే! మరుక్షణంలో ఇత్తడి చెంబుతో అచ్చియ్యమ్మ యింటి ముందు వాలాడు. అచ్చియ్యమ్మ అతి దారుణమయిన నియమాలతో డబ్బుల్ని వడ్డీకి స్తుంది. చెంబు మీద ఓ రూపాయి అప్పు యిచ్చింది. వారం రోజులలోగా రూపాయికి మరో పావలా కలిపి ఆమె కిచ్చి చెంబు తిరిగి తీసుకోవాలి. లేక పోతే ఒకటి, రెండు. మూడు వారాలు చూసేక, చెంబు ఆమె స్వంతమయి పోతుంది. ఆ నిబంధనలకు అంగీకరించి తీసికొచ్చిన రూపాయి పట్టుకొనే హాలు దగ్గర నిల్చున్నాడు నాగరాజు.

ఒంటిగంటన్నరకు బుకింగ్‌తలుపులు తెరిచారు. గుసారంలా వున్న ఆ యిరుకు సందులోకి క్యూ గబగబా జొర బడింది. ఓ యిరవై నిమిషాల తర్వాత బుకింగ్ నించి బయట కొచ్చాడు నీరసం, నిస్త్రాణతో. వాడిపోయిన తోట కూర కాడలాగ కనబడుతున్నా చేతిలోని టిక్కెట్లను మాత్రం అప్పుడే చెట్టు నుంచి తెంపిన పారిజాతపు పువ్వుల్లా నలగకుండా తాజాగా వుంచాడు. బయటి కొచ్చి ముఖం మీద చెమటను కమీజుతో తుడుచుకుని దేవలోకంలోని బంగారపు పువ్వులను సాహసంతో సాధించిన ఉజ్జయినీ రాజకుమారుడి లాగ పోజు పెట్టి రోడ్డు మీదకు నడిచాడు.

నడిస్తే - ఏమయింది?

అదిగో అదిగో చూడండి:

అక్కడ,

సంబరాల సైంలో సంతలో చేరిన జనంలా క్రిక్కిరిసి వున్న జనమధ్యలో ఎనుపోతుల్లాగ వున్న యిద్దరు మను షులు నిల్చున్నారు. వారికి వొంటిమీద కమీజుల్లేవుగాని వారి చేతులలో టిక్కట్లు న్నాయి. "ఎవరికా్కవాలండి ఫ్లోర్ టీకెవరిక్కావాలండీ, నలభై పయిసాల టీటు రూపాన్నరండీ .... రావాలండి రావాలి" — అంటూ అరుస్తూ తిరుగు తున్నారు. నాగరాజు అదంతా గమనిం చాడు. వాళ్ళంతా ఒక్కోటిక్కట్టు రూపాయిన్నరకి అమ్ముతున్నారు. కానీ తనుమాత్రం రూపాయి పావలాకే అమ్మెయ్యాలి. అలాగైతే వేగం చెల్లు బడయి పోతాయి. తనూ వాళ్ళలాగే కేకలు వేయసాగాడు.

"ఎవలిక్కావాలండీ ఫ్లోర్‌టీకెవులి క్కావాలండి .... రావాలండి, జల్దీగా రావాలండి, రొండే టీట్లున్నాయండీ—" కేకలేస్తూ తిరుగుతున్న నాగరాజు దగ్గరకో వ్యక్తి వచ్చాడు.

ఎవరా వ్యక్తి?

అదిగో అదిగో చూడండి!

"ఏరా అబ్బాయ్ - టిక్కెట్లెన్ను

న్నాయ్?" అతను.

"మీ కెన్ని కావాలండి ?"

"నాలుక్కావాలి"

"నాకాడ రొండే వున్నాయండి - మనిషికి రొండే యిస్తున్నారు"-

"సరే, ఆ రెండూ యిలాగియ్యి"- ఇచ్చాడు నాగరాజు - అంతే - వాడి బుర్ర వాచిపోయినంతగా ఫెడ ఫెడీ మంటూ జెల్లలు తగిలాయి. బుగ్గలు కందిపోయేటంతగా లెంపకాయలు తగిలాయి. ఇంకో నాలుగు తన్నులుకూడా తగిలాయి. అనుకోని యీ దెబ్బల వర్షానికి నాగరాజు కళ్లు బైర్లు కమ్మాయి, తనని అనవసరంగా, అతి దారుణంగా కొట్టిన ఆగంతకుడి వైపు పరీక్షగా, భయంగా చూశాడు. అతను దెయ్యం గీసిన గీతలా అస్తవ్యస్తంగా వంకర టింకరగా వున్నాడు. వంటి మీద వేసుకున్న తెల్లని చొక్కా మేకుకి తగిలించినట్టుగా అల్లలాడి పోతోంది. నెత్తిమీద పొట్టిగా, నల్లగా వున్న వెంట్రుకలు తారుతో తడిపిన మేకుల్లా పైకి నిక్కబొడుచుకొని వున్నాయి. మబ్బేసిన ఆకాశంలా నల్లగా వున్న అతని ముఖంలో కాస్తయినా కనికరం కనబడ్డంలేదు.

"గాలికి పుట్టి గండానికి పెరిగే ప్రతీ బేవార్సు నాకొడుక్కీ ఈబ్లేకుమార్కెట్టో ఏపారమైపోయింది. నీ వొయిసెంత్రా లంజకొడకా? చూస్తే నీకింకా బొడ్డూడలేదు -నీకూ బ్లేకుమార్కెట్ట్రా?"— అంటూ గుడ్లురుముతూ గదమాయించాడు దెయ్యం గీతలాంటి ఆ మనిషి.

"మీరు...మీరెవులు" - గడగడ వణుకుతూ అడిగాడు నాగరాజు.

"ఎవర్నా? మీ బాబున్రా! డ్రెస్సులో వుంటే నీలాంటి బేవార్సెదవలు పట్టుబడరని మఫ్టీలో వుంటున్నాం. ఇప్పుడు బోధపడిందా నే నెవణ్ణో: పడితే మరి-మరియాదగా ఎల్లిపో! లేకపోతే కంట్రోల్ రూం యీ ప్రక్కనే వుంది. కొట్లో ఏయించేగల్ను" — అన్నాడా పోలీసు ముఖం ముటముట లాడించుకుంటూ.

తనని పట్టుకున్నవాడు మఫ్టీలోవున్న పోలీసని తెలియగానే వాడి మనసు ఈదురు గాలిలోఎండుటాకులా రెప రెపలాడి పోయింది.

"బాబూ, జెవానుబాబూ...నీకు దండ పెడతాను-సాలా కష్టపడి యీ టీట్లు తీసేను-ఇంకెప్పుడూ యిలాంటి పనుల్చెయ్యను బాబూ....ఈ పాలికి దయ సూపించి ఒగ్గియ్యండి....నాటీట్లు నాకిచ్చియ్యండి బాబూ..." అంటూ దీనంగా ప్రాధేయపడ్డాడు.

"కష్టపడి చేసాడు కదాని కూనీ చేసినోణ్ణి ఒగ్గేస్తారేట్రా? నే న్చెప్పింది రైటేనా? రైటయితే మరెల్పో! చిన్న గుంటడివని ఒగ్గేస్తన్నాను - లేకపోతే కంట్రోల్ రూం కంపించెయ్యడం పెద్ద పనేంగాదు-ఎల్పో ఎల్పో"-అంటూ ఆ

పోలీసు అక్కణ్ణుంచి ముందుకు కదిలాడు.

వీరిద్దరి గురించీ చుట్టూవున్న జనం పట్టించుకోవడంలేదు. ఆ జవానుని అనుసరించాడు నాగరాజు. "బాబూ బాబూ, నానొక్కణ్ణే లేను బాబూ ... అల్లక్కడంత మంది బ్లేకులో టికెట్లమ్ము తున్నారండీ... సిన్న గుంటణ్ణని నాకాడ టీట్లు లాక్కున్నారు. ఇది న్యాయం కాదండీ...."—అంటూ కళ్ళంట నీరు కారుతుండగా, పెదవులు వణకుతుండగా దీనంగా ప్రార్థించాడు. ఆ ప్రార్థన పోలీసుని కరిగించలేదు. సరిగదా మరింత కోపం తెప్పించింది.

ఇంక గత్యంతరం లేదని నాగరాజు ఏడ్చుకుంటూ కాస్త నీడవున్న చోటుకి వెళ్ళిపోయాడు. వెళ్ళాడన్న మాటేగాని వాళ్ళు వేడెక్కింది. గుండె బరు వెక్కింది, వెక్కివెక్కి ఏడ్చుకుంటూనే పోలీసు ఎటు వెళ్తున్నదీ, ఏంచేస్తున్నదీ, గమనిస్తున్నాడు.

ఎక్కడి కెళ్ళాడు.

ఏం చేశాడు ?

అదిగో అదిగో చూడండి !

పోలీసు మెల్లిగా ఎనుపోతుల్లాంటి మనుషుల దగ్గర కెళ్ళాడు.

వాళ్ళని పట్టుకుని– ఫెడీఫెడీ తన్ని టిక్కట్లు లాక్కున్నాడు– కాదు కాదు– లాక్కుంటాడు లాక్కుంటాడు లాక్కుం టాడు అని నాగరాజు అనుకున్నాడు.

కానీ

పోలీసు ఎనుపోతుల్ని తిట్టలేదు– కొట్టలేదు– వారి దగ్గర్నించి టిక్కట్లు లాక్కోలేదు.

మరేం చేశాడు ?

అదిగో అదిగో చూడండి !

తన దగ్గర్నించి లాక్కున్న టిక్కట్లని ఆ ఎనుపోతుల చేతుల్లోపెట్టి ఏదో చెప్పాడు. మూడు నిమిషాలు గడవలేదు పోలీసిచ్చిన టిక్కట్లను ఒకొక్కటి రూపాయిన్నర చొప్పున అమ్మి చిల్లరని అతని చేతిలో పెట్టారు ఎనుపోతులు. చిల్లరని చల్లగా జేబులో వేసుకుని మెల్లిగా అక్కడున్న ఐస్ షర్బత్ బండిదగ్గర కెళ్ళాడు

నాగరాజు పళ్ళు పటపట లాడాయి. కోపంతో కాళ్ళు గజగజ వణికాయి. ఆ కోపంతో తను ఏనుగునైనా చంపెయ్యగల ననుకున్నాడు – తన్ను టిక్కట్లమ్మితే నేరమన్నాడు–కానీ తనే మరొకడికిచ్చి అమ్మించి ....

తనిప్పు డేం చేయాలి ?

అవును—అవునతనేం చేయాలి ?

ఏం చేశాడు ?

అదిగో అదిగో చూడండి :

రోడ్డంతా కలియవెదికి చేతికి అమిరి నంత రాయిని తీసుకున్నాడు. బాగా గురి చూసి, తన శక్తిని, కోపాన్ని, కసిని, ఆకలిని ఆ చేతిలోకి తెచ్చుకుని రయ్ మని పోలీసు మీదకి విసిరాడు.

కానీ ఆ రాయి పోలీసుకి తగల్లేదు- షర్బత్ బండికి తగిలి కింద పడి పోయింది——కానీ, పోలీసు తనకే తగిలి నంతగా అదిరి, నాగరాజువైపు వురిమి చూశాడు; చూసి "అమ్మ గుంట్లంజి కొడుకు....పట్టుకో పట్టుకో" అంటూ కేకలేస్తూ నాగరాజు మీదకి మేక మీదకి దూకిన పులిలా లంఘించాడు.

నాగరాజు పట్టుకు దొరక్కుండా పరిగెత్తాడు.

ఇద్దరూ రయ్ రయ్ మని పరిగెత్తారు.—

ఒకటి, రెండు, మూడు....ముప్పై అడుగులు—

అంతే—

'కయ్' మన్న శబ్దంతో కారు సడన్‌గా ఆగిన చప్పుడు—అందులోనే 'అమ్మా' అన్న ఆర్తనాదం కలిసి పోయింది.

ఏమయిందక్కడ?

అదిగో, అదిగో చూడండి!

పాలసముద్రంలా స్నానమాడిన రాజహంసలా ఎండలో అందంగా మెరుస్తున్న కారు - కారు నల్లటి చక్రాల క్రింద నూనెతో కలిసిన సింధూరంలా ఎర్రగా మెరుస్తున్న రక్తం - ఆ రక్తం మధ్య బోర్లా పడివున్న శవం--

ఆ శవం నాగరాజుది.

అల్లంత దూరంలో ఎండలో పెట్టిన వెన్నముద్దలా మెరుస్తున్న మెదడు-

అంతా క్షణంలో జరిగిపోయింది.

శవం చుట్టూ నీడలు ముసిరాయి.

ఎలా జరిగింది ది?-

చుట్టూ గుమిగూడిన నీడలు ప్రశ్నించాయి.

అందుకా "పోలీసు" ఏమన్నాడు?

అదిగో అదిగో చూడండి!

అదిగో అదిగో వినండి!

"అల్లక్కడ గుమిగూడిన జనంలో ఎవరిదో పర్సుకొట్టేసి యీ కుర్రోడు పరిగెత్తుకొస్తున్నాడు- నేను పట్టుకుంటే-నా చెయ్యి కటుక్కున కరిచేసి....ఇదిగో నా చేతిమీద కాటు ఆడు కరిచింది. ఆణ్ణి పట్టుకుందావని ఎంట తరిమేను.... యింతలో యీ కారొచ్చి..."

అన్నాడు ఆ "పోలీసు", కుడిచేత్తో జేబులోని చిల్లరని తడుముకుంటూ.

●

---

## వాక్యం రసాత్మకమ్....

వాక్యం వెంబడి వాక్యాన్ని రసవంతంగా కూర్చి పాఠకుడి మనస్సు నలరించి, ఆద్యంతం ఆసక్తితో చదివించే శక్తియే కథకుడి కుండాల్సిన లక్షణాలన్నింటిలోనూ అతి ముఖ్యమైనది.

—జాన్ గాల్స్ వర్దీ

---